


బాబోయ్.. తిరుమల!





ఎడతెగని రద్దీ.. చిటపటమని కురుస్తూనే ఉన్న వాన.. వణికిస్తున్న చలి.. తిరుమలలో, తిరుపతిలో ఆదివారం చిత్రమైన వాతావరణం నెలకొంది. అలిపిరి కొండలమీద పచ్చని చెట్లతో ముచ్చట్లాడుతున్నట్టుగా తెల్లని మబ్బులు వాలి కనువిందు చేశాయి. టోల్‌గేట్‌లో బారులు తీరిన వాహనాలు భక్తులను ఇక్కట్లపాలు చేశాయి. తిరుమల కొండమీదా వరుస సెలవుల మూడో రోజున కూడా ఎటు చూసినా భక్తజనమే కిటకిటలాడుతూ కనిపించారు. కిలోమీటర్ల దూరం సర్వదర్శనం భక్తులు క్యూలైన్లలో నిలబడ్డారు. గదులు దొరక్క తల తడవని తావుల్లో సర్దుకుని కూర్చున్నారు. ఆలయం ముందు చలికి వణుకుతూ తిరుగుతూ కనిపించారు.

- ఆంధ్రజ్యోతి, తిరుమల, తిరుపతి



హోటల్ మేనేజ్మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖలు సంయుక్తంగా తిరుపతిలో నిర్వహిస్తున్న స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషియన్‌లో 2025-26 సంవత్సరానికి వివిధ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ టూరిజం అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆమ్రపాలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

- బీఎస్సీ (హెచ్ అండ్ హెచ్.ఏ) 3 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్‌లో 40శాతం పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులు.
- క్రాఫ్ట్ కోర్సు ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పేటిస్సేరి, సర్టిఫికెట్ కోర్సు ఇన్‌ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ కోర్సులకు పదో తరగతి పాసైన వారు అర్హులు.

ఈ కోర్సులకు వయో పరిమితి లేదు. కోర్సు పూర్తి చేసిన తర్వాత ఏపీ పర్యాటక శాఖ హోటళ్లు, ప్రముఖ హోటళ్లలో ఉద్యోగావకాశం కల్పిస్తారు. యువతీ యువకులకు వేర్వేరుగా వసతి సౌకర్యం ఉంటుంది. ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. 'ఎస్ఐహెచ్ఎంటీపీటీ.ఓఆర్‌జీ'ని సంప్రందించాలి. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 97013 43846, 91005 58006, 97004 40604 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

- తుడా వీసీ శుభం బన్సల్

తిరుపతి, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సవరణ ఉత్తర్వులు (జీవో నెంబర్ 134) జారీ చేసిందని తుడా వైస్ చైర్మన్ శుభం బన్సల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 డిసెంబర్ 31 నాటికి దరఖాస్తు చేసుకోలేని స్థల యజమానులకు ప్రయోజనం కల్పించడంతోపాటు ఈ ఏడాది జూన్ 30కు ముందు వేసిన లేఔట్లలో రిజిస్ట్రేషన్ అయిన అనధికార ప్లాట్లను రెగ్యులర్ చేయడానికి ఈ పథకం కొనసాగించారని వివరించారు. మున్సిపల్, స్థానిక సంస్థలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వెలుపల మాస్టర్ ప్లాన్లు జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్లు పరిధిలోని గ్రామ పంచాయతీలు, పరిశ్రమల ప్రాంత పరిధిలోని ప్రాంతాలకు ఈ స్కీమ్ వర్తిస్తుందన్నారు. స్థలాల ప్లాన్లు తయారు చేసుకుని అపరాధ రుసుంలో 50శాతం లేదా రూ.10వేలకు తగ్గకుండా చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుంచి 90 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

శ్రీహరికోట తీరంలో బోటు కలకలం

- బోగోలు మండలం జువ్వలదిన్నె వాసిగా గుర్తింపు
- విచారణానంతరం పంపేసిన పోలీసులు

సూళ్లూరుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోట సముద్ర తీరం ఒడ్డున ఓ పడవ ప్రత్యక్షమవడంతో కలకలం రేగింది. శ్రీహరికోట పోలీసుల సమాచారం మేరకు.. ఆదివారం తెల్లవారుజామున షార్‌లోని సముద్ర ఒడ్డున పడవతో ఓ వ్యక్తి తిరుగుతుండడంతో బందోబస్తులో ఉన్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. బోటుతో పాటు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం శ్రీహరికోట పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో.. అతడు నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామానికి చెందిన సీహెచ్ శ్రీనివాసులు అనే మత్స్యకారుడని తేలింది. చెన్నై వెళ్లి సముద్రంలో చేపలవేట చేసే బోటును కొనుగోలు చేశారు. ఆ బోటును తీసుకుని చెన్నై నుంచి సముద్ర తీరానే శ్రీహరికోట మీదుగా కావలికి వెళుతున్నాడు. సరిగ్గా షార్ వద్దకు వచ్చేసరిగా బోటులో మోటారు మొరాయించింది. చేసేదేమి బోటును సముద్రం ఒడ్డుకు తీసుకొచ్చాడు. సమీపంలో విధుల్లో ఉన్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది అనుమానంతో బోటు యజమాని శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నట్లు తేలింది. జువ్వలదిన్నెవాసిగా తేలడంతో, అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చి పూర్తి వివరాలు తెలుసుకున్నాక బోటు యజమానిని పంపించేశారు.

వరి రైతు వెన్ను విరిచిన వర్షం



సూళ్లూరుపేట మండలం మంగళంపాడు సమీపంలో..



కోట మండలం రాజుపాళెం వద్ద పడిపోయిన వరి పైరు

మొన్నటి వరకు పంటను తడుపుకొనేందుకు వర్షం కోసం రైతులు ఎదురు చూశారు. వరి ఎన్ను దశకొచ్చిన ఈ సమయంలో ఆ వర్షమే రైతు వెన్ను విరిచింది. నాలుగైదు రోజులుగా కురుస్తున్న తేలికపాటి జల్లులు, గాలితో వరి కోత దశలో ఉన్న వరి పైరు పూర్తిగా వాలిపోయింది. నీళ్లల్లో మొలకెత్తే దశకు చేరుకోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కోట మండలంలోని గూడలి, దక్షిణపాలెం, రాజుపాళెం, తిన్నెపూడి, తాటితోపు, ఊనుగుంటపాళెం, రుద్రవరం గ్రామాల్లో రైతులు వరి ఎడగారు సాగు చేపట్టారు. ఆయా పంటలు వెన్నుదశలో, కోత దశలో ఉండగా నేలపై వాలిపోయి కోత కోసేందుకు వీల్లేకుండా పోతోంది. సూళ్లూరుపేట మండలం మంగళంపాడు, మంగానెల్లూరు, కోటపోలూరు, సామంతమల్లాం, మన్నారుపోలూరు, ఇలుపూరు గ్రామాల్లోనూ కోత దశకు వచ్చిన వరిపైరు వర్షం ధాటికి నేలకొరిగింది. ఎన్నుదశలో ఉన్న వరిపైరు వాలిపోవడంతో కోతకు ఇబ్బందిగా మారింది. మొలకలు వస్తే నష్టపోవడమే. పలుచోట్ల వర్షంలోనూ రైతులు పంట నూర్పిడి చేస్తున్నారు. వచ్చిన అరకొర పంటను అమ్ముకుని బయటపడుతున్నారు. మరో రెండు రోజులు ఇదే విధంగా గాలులు, వర్షం కురిస్తే పొలాల్లో వాలిపోయి ఉన్న వరి పైర్లన్నీ మొలకెత్తి పనికిరాకుండా పోతాయి. పెళ్లకూరు మండలంలోనూ వరి కోత దశకురాగా.. వర్షాలతో ఇబ్బంది పడుతున్నారు.

- కోట/సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

నేడు పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని, సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అర్జీదారులు కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా వెబ్‌సైట్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.అర్జీల స్థితిని తెలుసుకునేందుకు 1100 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఇక మండల, డివిజన్ స్థాయిలోనూ పీజీఆర్ఎస్ జరుగుతుందని, అక్కడ పరిష్కారం కాని వారే కలెక్టరేట్‌కు రావాలని తెలిపారు.

పదిశాతం పెరిగిన మహిళా ప్రయాణికులు

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం అమలుతో శనివారం జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీలో పది శాతం మహిళా ప్రయాణికులు పెరిగారు. శ్రీకృష్ణ జన్మాష్టమితో శనివారం సెలవు. దీంతో మహిళా ఉద్యోగులు, కూలీలు దాదాపు ఇళ్లలోనే గడిపారు. ఇతర మహిళల నుంచి ఉచిత ప్రయాణానికి స్పందన లభించింది. పథకం అమలు కాకముందు రోజుకు సగటున దాదాపు 35వేల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో తిరిగేవారు. శనివారం వేకువన 12నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు తొమ్మిది డిపోల బస్సుల్లో 38,062మంది మహిళలు, 862మంది బాలికలు చొప్పున 38,924 మంది ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వీరికి జీరో టికెట్ కింద రూ.16.90 లక్షలు ఆదా అయినట్లు ఆర్టీసీ పేర్కొంది.

ఉత్సాహంగా ఉట్లోత్సవం

తిరుచానూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం ఉత్సాహభరిత వాతావరణంలో ఉట్లోత్సవం జరిగింది. అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీకృష్ణస్వామి ఆలయంలో అర్చకులు గోకులాష్టమిని పురస్కరించుకుని విశేషాదిపూజాకార్యక్రమాలు నిర్వహించారు. రుక్మిణీ,సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామిని బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి వాహనం మండపంలో వేంచేపు చేశారు. అమ్మవారి ఆలయం ఎదుట టీటీడీ ఉద్యోగులు, అర్చకులు, సిబ్బంది ఉట్లోత్సవంలో పాల్గొన్నారు. యువత ఉత్సాహంతో ఉట్టి కొట్టారు. అనంతరం ఆస్థానంతో గోకులాష్టమి వేడుకలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోహరీందర్‌నాథ్, శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్ రమేష్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఉట్టి కొడుతున్న టీటీడీ ఉద్యోగులు, అర్చకులు,యువకులు - ప్రత్యేకాలంకారంలో రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు

తాగుడు తీసుకొచ్చిన తిప్పలు

- మద్యం తాగి అలిపిరికి చేరుకున్న తండ్రి
- తనిఖీల్లో బస్సు ఎక్కకుండా అడ్డుకున్న భద్రతాసిబ్బంది
- ఈలోపే బస్సులో నిద్రిస్తూ తిరుమల చేరుకున్న చిన్నారి



జ్యోతికి హారికను అప్పగిస్తున్న కంట్రోలర్

తిరుమల, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): బస్సులో నిద్రపోతూ తిరుమల చేరుకున్న ఏడాది పాపను ఆర్టీసీ సిబ్బంది గుర్తించి తల్లికి అప్పగించారు. ఆర్టీసీ అధికారులు తెలిపిన మేరకు.. గూడూరుకు చెందిన వీరయ్య, జ్యోతి తిరుమలలో హాకర్లుగా ఉంటున్నారు. వీరికి ఏడాది వయసున్న కుమార్తె హారిక ఉంది. ఆదివారం ఉదయం ముగ్గురూ తిరుపతికి వెళ్లి సాయంత్రం తిరుమలకు బయలుదేరారు. ఆరు గంటల సమయంలో అలిపిరి చెక్‌పాయింట్ వద్ద.. నిద్రిస్తున్న కుమార్తెను బస్సులోనే ఉంచి వీరు తనిఖీ కోసం కిందకు దిగారు. వీరయ్య మద్యం తాగినట్లు భద్రతా సిబ్బంది గుర్తించి తిరుమలకు వెళ్లేందుకు అడ్డుకున్నారు. ఈ తతంగం జరిగేలోపే బస్సు బయలుదేరి వెళ్లిపోయింది. కొంతసేపటి తర్వాత తల్లి జ్యోతి పాపకోసం బస్సు దగ్గరకు రాగా, తిరుమలకు వెళ్లిపోయినట్టు సమాచారమిచ్చారు. తమ కుమార్తె బస్సులో ఉందని, తమకు అప్పగించాలని భద్రతాసిబ్బందిని ఆమె ప్రాధేయపడ్డారు. దీంతో అలిపిరి సిబ్బంది తిరుమల ఆర్టీసీ అధికారులను సంప్రదించారు. జ్యోతి దంపతుల వద్దనున్న టికెట్ల నెంబర్లు, సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా బస్సును గుర్తించారు. తిరుమల రాంభగీచ ఆర్టీసీ కంట్రోలర్ మైఖేల్ ఆ బస్సును పరిశీలించగా పాప నిద్రిస్తుండటాన్ని గమనించి తన సంరక్షణలోకి తీసుకున్నారు. వెంటనే సమాచారాన్ని అలిపిరి సిబ్బందికి తెలియజేయడంతో జ్యోతి తిరుమలకు చేరుకోగా చిన్నారిని ఆమెకు అప్పగించారు.

వైభవంగా వ్యాస పూజ

- ఇస్కాన్‌లో ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఇస్కాన్ టెంపుల్‌లో మూడు రోజులపాటు జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆదివారం నాటి వ్యాసపూజతో ముగిశాయి. ఆలయంలో అష్టసఖీ సమేత శ్రీకృష్ణుడికి ఉదయం మంగళహారతినిచ్చి భక్తులకు దర్శనం కల్పించారు. తర్వాత దర్శన హారతి అత్యంత వేడుకగా నిర్వహించారు. భక్తివేదాంత స్వామి మందిరంలో ఇస్కాన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసపూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. వ్యవస్థాపకులు భక్తివేదాంత స్వామి ప్రభుపాద ప్రతిమకు అభిషేకాలు చేశారు. నైవేద్యాలను సమర్పించారు. వినాయకనగర్ మైదానంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



అక్కా.. నే చనిపోవాలనుకుంటున్నా!

- ఐదు రోజుల కిందట ఫోను చేసిన మనోజ్
- ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు సోదరి ఫిర్యాదు



మనోజ్‌కుమార్

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 'అక్కా, నేను తిరుపతి బస్టాండు వద్ద ఉన్నా. నా వల్ల మీరు అప్పులపాలయ్యారు. అందుకని నేను చనిపోవాలనుకుంటున్నా' అని ఈనెల 12వ తేది ఉదయం 6.30 గంటలకు ఎం.మనోజ్ కుమార్ ఫోను చేశారు. ఆ తర్వాత ఫోను స్విచ్ ఆఫ్ అయింది. అప్పట్నుంచి వెదికినా ఆచూకీ లేకపోవడంతో ఆదివారం తిరుపతి పోలీసులకు నాగపావని ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎం.మనోజ్‌కుమార్‌ది అనంతపురం జిల్లాలోని మండల కేంద్రమైన పామిడి గ్రామం. ఇంటి వద్దే ఉంటున్నారు. షేర్ మార్కెట్లో డబ్బులు పెట్టుబడి పెట్టి నష్టపోయారు. ఈనెల పదో తేది ఉదయం 9 గంటలకు ఫోను చేసి రైలులో తిరుపతికి వెళ్తాస్తానని బయలుదేరి వెళ్లారు. అక్కడ నుంచి తిరుమల కొండకి వెళ్లి శ్రీవారిని దర్శనం చేసుకుని తిరుపతికి వచ్చారు. 12వ తేది ఉదయం 6.30 గంటలకు కళ్యాణదుర్గం మండలంలోని సోదరి నాగపావనికి ఫోనుచేసి చనిపోవాలనుకుంటున్నానని చెప్పి స్విచ్ ఆఫ్ చేయడంతో ఆందోళన చెందారు. 'మేమంతా తిరుపతికి వచ్చి పరిసర ప్రాంతాల్లో వెదికాం. ఎక్కడా మా తమ్ముడి ఆచూకీ తెలియ రాలేదు. మా స్నేహితులు, బంధువులకు చెప్పి వెతకాలని చెప్పాం. ఎంతకీ ఆచూకీ తెలియరాలేదు' అంటూ నాగపావని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



తిరుచానూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో ఆదివారం జరిగిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. వారాంతపు సెలవు పురస్కరించుకుని చెన్నైకు చెందిన లాస్యధర పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ సంస్థకు చెందిన కళాకరులు చార్విపర్షిత, తన్వి అనిమ మలర్, ఇనియా, సోనియా, మహితి, సంజన ప్రణవిక తదితర కళాకారులు పుష్పాంజలి, హనుమాన్ విరుతం, రంజని, శ్రీకృష్ణ కామన వంటి గీతాలకు నృత్య ప్రదర్శనలు చేశారు. వారికి ఏవో సూర్యతేజ జ్ఞాపికలు అందజేశారు.

వచ్చేనెల 5 నుంచి పవిత్రోత్సవాలు

తిరుచానూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయంలో వచ్చే నెల 5 నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. 5న పవిత్ర ప్రతిష్ఠ, 6న పవిత్ర సమర్పణ, 7వ తేదీన పూర్ణాహుతితో అమ్మవారి వార్షిక పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా 2వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. ఈ మూడు రోజుల పాటు ఆలయంలో ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. రూ.750 చెల్లించి భక్తులు పవిత్రోత్సవాల్లో పాల్గొనవచ్చు. ఆలయంలో యాత్రికుల,సిబ్బంది వల్ల తెలియక జరిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు లోపం రానీయకుండా నివారించేందుకు ఏటా మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ.

గుండాల గంగమ్మకు పొంగలి నైవేద్యం



తిరుపతిరూరల్, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): దుర్గసముద్రం జగనన్న కాలనీలో ఆదివారం గుండాల గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగలి నైవేద్యంగా సమర్పించారు. ఉదయం అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలు..మంగళవాయిద్యాలతో మహిళలు పొంగళ్లు తీసుకొచ్చి మొక్కు చెల్లించారు. స్థానికులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈశ్వరబాబుకు భాగవత రత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఈశ్వరబాబు

పాకాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడు డాక్టర్ కలువకుంట ఈశ్వరబాబుకు భాగవతరత్న పురస్కారం లభించింది. హైదరాబాదు కొండాపూర్‌లోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో శనివారం రాత్రి శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలుగు భాగవత ప్రచార సమితి ప్రతినిధులు ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు. భాగవత గణనాధ్యాయి ఊల సాంబశివరావు ఆధ్వర్యంలో నడుస్తున్న తెలుగు భాగవత ప్రచార సమితి అధ్యక్ష కార్యదర్శులు ఊల పణికిరణ్, బండి శ్రీనివాస శర్మ, సీతారామాంజనేయ ఆలయ అధ్యక్ష కార్యదర్శులు వాసుదేవరావ్, విజయరాఘవాచార్యులు, కవి చింతా రామకృష్ణ చేతులమీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. మెడల్, ప్రశంసాపత్రం, రూ.10వేలు నగదు అందజేశారు. పూతలపట్టు మండలం వజ్జిరెడ్డిపల్లికి చెందిన డాక్టర్ ఈశ్వరబాబు కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఆంధ్ర మహాభాగవతం చిన్న పాత్రలు అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ పురస్కారం ప్రదానం చేశారు.

నేడు అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన

తిరుపతి రూరల్, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో జరిగే అన్యాయాలు, అవినీతి, అక్రమాలపై ప్రశ్నించే విద్యార్థిసంఘాలకు ప్రవేశం లేకుండా రాష్ట్రప్రభుత్వం చీకటి జీవోలని వెలువరించిందని వైసీపీ విద్యార్థివిభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆరోపించారు. తుమ్మలగుంటలోని పార్టీకార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆ జీవోలకు వ్యతిరేకంగా సోమవారం అంబేడ్కర్ విగ్రహాల ముందు నిరసన కార్యక్రమాన్ని చేపడతున్నామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, యశ్వంత్‌కుమార్‌రెడ్డి, జస్వంత్‌కుమార్‌రెడ్డి, వినోద్, ప్రేమ్‌కుమార్, ప్రదీప్‌కుమార్, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



రామచంద్రాపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి సందర్భంగా ఆదివారం రాత్రి రాయల చెరువుపేట రాధ, రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో మూలమూర్తికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఊంజల్‌సేవ చేశారు. రాత్రి 8గంటలకు వేదమంత్రాల మధ్య రుక్మిణీ సమేత వేణుగోపాలకస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వెంకటేశ్వర నాట్యమండలి ఆధ్వర్యంలో రాత్రి శ్రీకృష్ణలీలలు, కంస వధ నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ముసురు వర్షంతో ఇక్కట్లు

రామచంద్రాపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు రోజులుగా ముసురు వర్షం కురుస్తుండటంతో అన్ని వర్గాల ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. పగటి వేళ చిన్నపాటి చినుకులతో వ్యవసాయపనులకు అంతరాయం ఏర్పడుతోంది. మండలంలోని కొన్ని గ్రామాల నుంచి తిరుపతికి చిన్నపాటి వ్యాపారస్థులతోపాటు కూలీలు పనులకు వెళతుంటారు. పనులు లేకపోవడంతో ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షం కురుస్తున్నప్పటికీ చెరువులు నిండిన దాఖలాలు లేవు.

ఆనందగిరి బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.19.34 లక్షలు



హుండీ లెక్కింపు

పాకాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె ఆనందగిరి (పాళ్యంకొండ)పై వళ్లీదేవసేన సమేత కల్యాణ సుబ్రమణ్యస్వామివారి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో ఆలయానికి రూ.19,34,399 ఆదాయం వచ్చినట్లు ఉత్సవ కమిటీ చైర్మెన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు, ఈవో యువరాణి తెలిపారు. ఆలయం వద్ద ఆదివారం హుండీ లెక్కించారు. ఐదు రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాలలో తలనీలాల కింద రూ.2,30,000, సేవా టికెట్లుగా రూ.2,96,000లు, హుండీ ద్వారా రూ.14,08,399 ఆదాయం సమకూరింది. బ్రహ్మోత్సవాలలో సహకరించినవారందరికీ ఉత్సవ కమిటీ చైర్మెన్ ఈవో ధన్యవాదాలు తెలిపారు.

శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం ప్రారంభం



తిరుమల, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): భక్తుల ఐశ్వర్యం, ఆయురారోగ్య సంపదలు కాంకిస్తూ తిరుమల ధర్మగిరిలోని వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠంలో ఆదివారం సాయంత్రం నుంచి శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం ఘనంగా ప్రారంభమైంది. ఈ మహాయాగం ఈనెల 20వ తేదీ వరకు జరుగుతుంది. తొలిరోజు సాయంత్రం 6 గంటలకు ఆచార్య వరణం, మేదినీ పూజ, మృత్సంగ్రహణం, అంకురార్పణం, వేదారంభం వంటి కార్యక్రమాలు వైదికంగా నిర్వహించారు. 32 మంది వేదపండితుల సమక్షంలో వేదపారాయణం, సుందరకాండ పారాయణం తదితర వైదిక క్రతువులు జరుగుతాయి. 20వ తేదీన పూర్ణాహుతిలో యాగం ముగుస్తుంది. యాగంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, వేది విజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని, అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఝార్ఖండ్ హైకోర్టు జడ్జి



జస్టిస్ అంబుజనాథ్

తిరుమల, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అంబుజనాథ్ ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

చంద్రగిరి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎం.కొత్తపల్లె వద్ద పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం గుర్తు తెలియని మహిళను ఢీకొంది. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. వెనువెంటనే మరికొన్ని వాహనాలు మహిళ మృతదేహంపై దూసుకెళ్లాయి. దీంతో మృతదేహం ఛిద్రంగా తయారైంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తలకోన ఆలయ పునర్నిర్మాణ పనులకు నేడు భూమిపూజ

ఎర్రావారిపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తలకోన సిద్ధేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు సోమవారం ఉదయం భూమి పూజోత్సవం జరగనుంది. ఎమ్మెల్యే నాని చొరవ ఫలితంగా ఆలయ అభివృద్ధికి రూ.18కోట్లు మంజూరు చేసేందుకు టీడీడీ అంగీకరించింది. ఈక్రమంలో ఉదయం 10.51 నిమిషాలకు జరిగే భూమి పూజోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే నానితోపాటు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు హాజరుకానున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి. భాకరాపేట ఘాట్ నుంచి తలకోన వరకు చిన్నగొట్టిగల్లు,ఎర్రావారిపాలెం మండలాల టీడీపీ శ్రేణులు స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.

చెన్నైలో టీటీడీ ఛైర్మన్‌కు సన్మానం

తిరుమల, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుని చెన్నై తెలుగు సంఘం ఆదివారం ఘనంగా సన్మానించింది. చెన్నైలోని అయ్యావూ మహాల్ జరిగిన ఈ కార్యక్రమంలో తమిళనాడు మంత్రులు కెఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు గజమాలలతో సత్కరించారు. టీటీడీ ఛైర్మన్‌గా చేస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా ఈ సన్మాన కార్యక్రమం జరిగింది.

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి):వేంకటేశ్వర స్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.4.16 కోట్లు రాగా శనివారం శ్రీవారిని 87,759 మంది దర్శించుకున్నారు. 42,043మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

దాడి కేసులో ఐదుగురి అరెస్ట్

దొరవారిసత్రం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): దొరవారి సత్రం మండలం హరిగుంద్రం గ్రామానికి చెందిన సమ్మని రాజయ్యపై దాడి చేసి గాయపరిచిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ అజయ్ కుమార్ తెలిపారు. రెండు రోజుల క్రితం ఆనేపూడి వద్ద రాజయ్యపై వడికంద్రిగ గ్రామానికి చెందిన వల్లిపి నారయ్య, మరో నలుగురు రాజయ్యపై దాడి చేసి గాయపరిచారని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఆదివారం నిందితులను అరెస్టు చేసి 'మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుల్లో నలుగురు బాలురు కావడంతో వారిని చిల్డ్రన్స్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు.

రెండు బైక్‌ల ఢీ: ఒకరికి గాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మూరు సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన సుబ్రహ్మణ్యం మోటారు సైకిల్‌పై ఆదివారం రాత్రి గూడూరు వైపు వెళ్తుండగా తుమ్మూరు సమీపంలో ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యంకు గాయాలవడంతో స్థానికులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



వడమాలపేట,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు సర్వీసు ప్రారంభంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం వడ మాలపేటలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాగా వడమాలపేటకు చెందిన మల్లిక శనివారం ఉచితంగా తిరుపతిలోని ఇస్కాన్ ఆలయ దర్శనానికి వెళ్లింది. తిరిగి వస్తూ స్థానికంగా టీడీపీ నాయకులు చేపట్టిన పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి అభిమానం చాటుకుంది. టికెట్ లేకుండా ప్రయాణ వసతి కల్పించిన ఈ ప్రభుత్వం ఇలాగా కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు.

సుబ్రహ్మణ్యస్వామికి పంచామృత అభిషేకం

ఏర్పేడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పాపానాయుడుపేటలో వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారికి ఆదివరాం పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మురగప్ప ఆధ్వ ర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న ఆడికృత్తిక ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి.

విద్యార్థుల సంఖ్య పలుచ'బడి'....

- తగ్గుతున్న ప్రభుత్వ పాఠశాలలు
- పల్లె వీడి పట్టణబాట



పిల్లలు లేక మూతపడిన మాలపల్లె పాఠశాల

ఎర్రావారిపాలెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. మారుమూల వెనుకబడిన ఈ మండలానికి ఎటుచూసినా అటవీ ప్రాంతమే సరిహద్దు. గతంలో పోల్చుకుంటే పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. ఉపాధి, ఉద్యోగం ఇలా రకరకాల కారణాలతో పలువురు పట్టణబాట పడుతున్నారు. రవాణా సౌకర్యం కూడా మెరుగుపడింది. ఫలితంగా కొందరు పట్టణాల్లోనే పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. ఈ పరిస్థితుల ప్రభావం మండలంలోని ప్రభుత్వపాఠశాలల మీద పడుతోంది. దీంతొ తగినంతమంది పిల్లలు లేక రేషనలైజేషన్ కింద ప్రభుత్వాలు స్కూళ్ల సంఖ్యను కుదిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 3,4,5 తరగతుల వీలీనంతో కొన్ని పాఠశాలు మూతబడ్డాయి. ఈ విద్యా సంవత్సరంలో 2020-విద్యావిదానం అమలులో భాగంగా ఒక్కరూ చేరని పుట్టావాండ్ల పల్లె, కుమ్మరపల్లె, కూరపర్తి వారిపల్లె, మర్రిపాటి వారిపల్లె, మిదిగపల్లె,పెద్దగొల్లపల్లె, మాలపల్లె పాఠశాలలకు తాళం పడింది. దీంతో ఆ భవనాలు నిరుపయోగంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం వల్ల కొన్ని పాఠశాలలు 1,2 తరగతులకే పరిమితమయ్యాయి. ఇప్పుడు పంచాయతీకి ఒక పాఠశాల కూడా లేదు.

మండలంలోని 12 పంచాయతీలకు నెరబైలు, చింతగుంట, ఎర్రావారిపాలెం, ఉదయమాణిక్యం, బోడేవాండ్ల పల్లె, ఎల్లమంద, కోటకాడపల్లెలలో మాత్రమే 1 నుండి 5 తరగతుల వరకు మోడల్ స్కూళ్లు ఉన్నాయి. మిగిలినవి ఏకోపాధ్యాయ పాఠశాలలే. మిగతా 46 పాఠశాలల్లో 32 చోట్ల సింగిల్ డిజిట్‌లోపే విద్యార్థులుండటం ఆందోళన కలిగిస్తోంది. భవిష్యత్‌లో మరిన్ని మూతపడటం తథ్యమనిపిస్తోంది. కొన్ని చోట్ల అధికారుల నిర్ణయాలు విమర్శలకు దారితీస్తున్నాయి. ఉస్తికాయల పెంట ఎంపీపీఎస్ పాఠశాలలో 40 మందికి పైగా ఉన్నా 3,4,5 తరగతులను దూరాన పులిచెర్లవారిపల్లె పాఠశాల్లో విలీనం చేశారు. మేదరపల్లె, క్రాస్ కుమ్మరపల్లె పాఠశాలల్లో 40 వరకు ఉన్నా అధికారులు విలీన చర్యలు చేపట్టారు.

ముగిసిన ఆనందగిరి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు



ఉత్సాహభరితంగా జరిగిన తోటోత్సవంలో పాల్గొన్న యువకులు

పాకాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె ఆనందగిరి (పాళ్యంకొండ)పై వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఉభయదారులు వెలకటూరి రామచంద్రనాయుడు, యశోదమ్మ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో యాగ పూజ, కలశాభిషేకం, తోటోత్సవము, నిర్వహించారు. రాత్రి శ్రీరామనేని కృష్ణమనాయుడు కుటుంబ సభ్యులు మునెమ్మ, మదుమోహన్ చౌదరి, ప్రసాద్‌రావ్ (బుజ్జి)ల ఆధ్వర్యంలో, ధ్వజారోహణం, పాన్పుసేవ నిర్వహించారు. ఈ నెల 13న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలలో భక్తులు విశేష సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, పుష్పకావిళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. ఉత్సవకమిటీ చైర్మెన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు, ఈవో యువరాణి, ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు ఉషారాణి, మంజుల, హరి, బాలశేఖర్ రెడ్డి, చెంగల్రాయుడు, చిట్టెమ్మ, మధుమతి, శంకర్‌నాయుడు, లలిత, తులసీ, గౌతమ్, శివకుమార్, రంగప్రసాద్ పాల్గొన్నారు.

సత్యవేడు టీడీపీలో ఆకాశరామన్న ఉత్తరం కలకలం

సత్యవేడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు టీడీపీలో ఆకాశరామన్న ఉత్తరం కలకలం రేపుతోంది. 2024 ఎన్నికల్లో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు కొందరు అధిష్ఠానం బరిలోకి దించిన అభ్యర్థికి కాకుండా స్వతంత్ర్య అభ్యర్థికి పని చేశారని, ఈక్రమంలో ఆ స్వతంత్ర్య అభ్యర్థి నుండి సుమారు రూ.10 కోట్లు తీసుకున్నారని ఏడు మండలాలకు చెందిన 30 మంది పేర్లతో రెండు రోజుల క్రితం ఒక ఆకాశరామన్న ఉత్తరం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. వైసీపీ అనుకూల మీడియాలో ఈ కథనం ప్రచురితం కావడంతో ఇదంతా వైసీపీ కుట్ర అని ప్రచారం జరుగుతోంది. 2024 ఎన్నికల్లో ఆదిమూలం వైసీపీ నుండి టీడీపీలోకి వచ్చినపుడు మొదలైన విభేదాలు టీడీపీలో ఇప్పటికీ సద్దుమణగలేదనేందుకు ఇది తాజా ఉదాహరణ మాత్రమే. ఆదిమూలం గెలుపునకు పనిచేయబోమంటూ అప్పట్లోనే టీడీపీలోని కొందరు బహిరంగంగానే స్వతంత్ర అభ్యర్థికి ప్రచారం చేశారు. గెలిచాక కూడా ఆదిమూలంకి సొంత పార్టీలో సెగ తగులుతూనే ఉంది. ఒక మహిళా నేత ఆరోపణతో ఆయనను టీడీపీ నుంచి ఏకంగా సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. రెండు నెలల క్రితం కూరపాటి శంకర్‌రెడ్డిని పార్టీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్‌గా నియమించారు. ఈయన తీరుపై ఆదిమూలం అసహనం ప్రకటిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే నారాయణవనంలో టీడీపీ ఫ్లెక్సీల చించివేత, పిచ్చాటూరులో టీడీపీ నేతపై దాడి వంటి సంఘటనలు జరిగాయి. దీనిపై పార్టీ జిల్లా అధ్యక్షుడు నరసింహాయాదవ్ టీడీపీలో ఇలాంటి చర్యలు మానుకోవాలని లేకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవంటూ ప్రెస్‌మీట్లో హెచ్చరించారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆకాశరామన్న లేఖ ప్రత్యక్షమైంది. నామినేటెడ్ పదవుల భర్తీకి ప్రక్రియ మొదలైన వేళ ఆరోపణలు రావడం విశేషం.

తేనెటీగల దాడిలో 47 మందికి గాయాలు



గాయపడిన బసవాపల్లె గ్రామస్తులు

గుడిపాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో 47 మంది గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గుడిపాల మండలంలోని బసవాపల్లె గ్రామ సమీపంలో ఉన్న మునేశ్వరుడికి మొక్కులు తీర్చుకోవడానికి ఓ కుటుంబం పూజలకు ఆదివారం ఏర్పాట్లు చేసింది. బంధుమిత్రులు తరలివచ్చారు. పూజల్లో భాగంగా స్వామికి నైవేద్యం సమర్పించడానికి పొంగళ్లు పెడుతుండగా పొగ వ్యాపించింది. ఈ పొగ కారణంగా సమీపంలోని తేనెటీగలు ఒక్కసారిగా అక్కడున్న చిన్నాపెద్దపై దాడి చేశాయి. 47 మందికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన నాగరాజును చికిత్స నిమిత్తం 190 రామాపురం సీఎంసీకి తరలించారు. మిగిలినవారిని గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 108 అంబులెన్స్ ద్వారా తరలించారు. అనంతరం గ్రామంలో వైద్యాధికారి సంధ్య ఆదేశాలతో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. బాధితులకు వైద్య సేవలు అందించారు.



మర్రినే కప్పేసింది

మర్రిచెట్టు కింద మరే మొలకా మొలవదని అంటారు. కింద అయితే మొలవదు కానీ, మరి పైన..? అందుకేనేమో ఈ గురివింద తీగ ఏకంగా మర్రి చెట్టులోనే మొలిచి అల్లుకుంటూ అల్లుకుంటూ మొత్తం వృక్షాన్నే ఇలా కప్పేసింది. తెల్లటి పూతతో.. కశ్మీర్‌లో మంచురాలిన వృక్షంలా కనిపిస్తోంది. కోట పట్టణంలో శ్యామసుందరపురానికి వెళ్లే దారిలో ఈ శ్వేత సౌందర్యం కనువిందు చేస్తోంది.

- కోట, ఆంధ్రజ్యోతి

వైభవంగా కల్యాణ వెంకన్న ఉట్లోత్సవం



నారాయణవనం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నారాయణ వనం లోని కొలువైన పద్మావతి దేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి ఉత్స వాలలో భాగంగా ఆదివారం ఉట్లోత్స వాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యా పూజలు చేశారు. అనంతరం తోమాల సేవ, పంచాంగ శ్రవణం జరిపించారు. సాయంత్రం గోపూజ చేసి ఉట్లోత్సవం కోలాహలంగా నిర్వహించారు. యువకులు ఉట్టికొట్టేందుకు పోటీపడ్డారు. అనంతరం శ్రీకృష్ణ భగవానుడు, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటన్న తిరుచ్చి వాహనంపై పుర వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయాధి కారి నాగరాజు, ఆలయ అర్చకులు శ్రీధర్ భట్టాచార్య పాల్గొన్నారు.

భక్తజనసంద్రం ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తజనసంద్రంగా మారింది. వారాంతపు సెలవులు వరుస సెలవులుకావడంతో కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 26వేల మంది భక్తులు దర్శించు కున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేపట్టారు.

మామిడిపై 'గజ'దాడి

- కల్లూరు ఘాట్ సమీపంలో ఏనుగుల గుంపు

కల్లూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపు రెండ్రోజులుగా అడవిలో తిష్ట వేశాయి. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని దేవరకోన, మేఘాలకోనలో సంచరిస్తున్న ఏనుగులు శనివారం రాత్రి దేవళంపేట పంచాయతీ కుమ్మరిపల్లె వద్దకు వచ్చాయి. గ్రామంలోని మురళికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. అక్కడి నుంచి పాళెం పంచాయతీ జూపల్లె వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని నాగరాజు, లలితమ్మ, రామయ్య, రాజమ్మలకు చెందిన మామిడి చెట్లను విరిచేశాయి. కోటపల్లెలోని వెంకట్రమణ, సుబ్రహ్మణ్యంకు చెందిన మామిడిచెట్లను కూడా విరిచేసి, అక్కడినుంచి అటవీ ప్రాంతంలోని బోదబండ వద్దకు చేరుకున్నాయి. కాగా, కల్లూరు ఘాట్ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం ఏనుగుల గుంపు హల్‌చల్ చేశాయి. ఇది తెలుసుకున్న కల్లూరు పట్టణంలోని పలువురు యువకులు, హైవేపై వెళుతున్న ప్రజలు ఏనుగులను చూడటానికి అడవిలోకి వెళ్లారు. ఈ సందర్భంగా యువకుల అరుపులకు ఏనుగుల గుంపు ఘీంకారం చేసింది.





కల్లూరు ఘాట్ సమీపంలోని అడవిలో ఏనుగుల గుంపు - విరిచేసిన మామిడి చెట్టు కొమ్మలు

ఎస్ఎస్‌డీ టిక్కెట్ల కోసం పడిగాపులు

విష్ణునివాసం వద్ద జోరువానలో తడుస్తూ భక్తుల అవస్థలు



వర్షంలో తడుస్తూ క్యూలో వేచి ఉన్న భక్తులు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలేశుడి దర్శనం కోసం వచ్చే భక్తుల రద్దీ కొనసాగుతోంది. విష్ణునివాసం వద్ద సర్వదర్శనం టిక్కెట్ల కోసం క్యూలలో పడిగాపులు కాశారు. వర్షం పడుతున్నా లెక్క చేయకుండా బారులు తీరారు. సాధారణంగా రోజువారి కోటా ప్రకారం 21వేల టిక్కెట్లు జారీచేయాల్సి ఉండగా తిరుమలలో కొనసాగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని 15వేలకు ఆ సంఖ్యను కుదించినట్లు ఇక్కడి సిబ్బంది తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి టిక్కెట్లు జారీ చేపట్టారు. దీనికి రెండు మూడు గంటల ముందు నుంచే క్యూలైన్లలోకి చేరుకున్నారు. క్యూలైన్లలో షైకప్పులు లేకపోవడంతో వర్షంలో తడుస్తూ ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కొంతమంది గొడుగులు అడ్డుపెట్టుకోగా మరికొందరు టోపీలు, కర్చీఫు, తువాలును తలకు పెట్టుకున్నారు. అయినా జోరువానకు తడిసి ముద్దయ్యారు. క్యూలైన్ల వద్ద షైకప్పులు అమర్చకపోవడం వల్ల అటు ఎండ వేడిమికి తల్లడిల్లుతూ ఇటు వర్షానికి తడుస్తూ భక్తులు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా టీటీడీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

బాలాజీ లింకు బస్టాండులో ప్రయాణికులకు భద్రతేదీ?



బస్టాండు ప్రాంగణంలో ఖాళీ మందుబాటిళ్లు, నిద్రిస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అలిపిరి బాలాజీ లింకు బస్టాండులో ప్రయాణికులకు భద్రత కరువైంది. మందుబాబులు, యాచకులు, గుర్తు తెలియని వ్యక్తులకు అడ్డాగా మారిపోయిన బస్టాండులో ప్రయాణికులు భయభయంగా గడపాల్సి వస్తోంది. మందుబాబులు బస్టాండు ఆవరణలో రాత్రిపూట తిష్టవేసి మందు తాగుతూ హల్‌చల్ చేస్తున్నారు. బస్టాండు ఆవరణలో ఎటుచూసినా ఖాళీ మద్యం బాటిళ్లు కనిపిస్తున్నాయి. అలాగే పగలంతా చుట్టుపక్కల ప్రాంతాల్లో యాచించే వారు రాత్రిపూట అక్కడికి చేరిపోతున్నారు. తమకు సంబంధించిన దుస్తులు ఉతికి అక్కడే ఆరేస్తున్నారు. తిన్న ఆహార పదార్థాల వ్యర్థాలు ఎక్కడబడితే అక్కడ వేస్తున్నారు. దర్శనానికి వెళ్లే ముందు ఇలాంటి ఘటనలు చూసి భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన టీటీడీ విజిలెన్స్ విభాగం అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలున్నాయి. ఆర్టీసీ సిబ్బందికి, పోలీసులకు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో ఏ మాత్రమూ మార్పు రావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.







ఫ్రీ బస్ సూపర్ సక్సెస్‌పై టీడీపీ సంబరాలు



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సుగుణమ్మ, మునికృష్ణ తదితరులు

తిరుపతి, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం సూపర్ సక్సెస్ కావడం పట్ల తిరుపతి టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. ఏపీజీబీసీ ఛైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మహిళలతో కలసి ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. మహిళలను మహరాణులుగా చేసేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆమె చెప్పారు. ఫ్రీ బస్సుతో మహిళల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయని, త్వరలోనే నెలకు రూ.1500 కూడా అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు దంపూరి భాస్కర్ యాదవ్, కుమారమ్మ, సూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, బ్యాంకు శాంతమ్మ, రేవతి, సూర్యకుమారి, హేమావతి, కల్పన, జయంతి, రేఖ, జాహ్నవి, యశోద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మలబార్‌లో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువెలరీ షో

తిరుపతి అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువెలరీ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు షోరూం హెడ్ రిజీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీన వరకు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో మైన్ ధ్రువీకరించిన వజ్రాభరణాలు, ఎరా అన్కట్ డైమండ్స్, ప్రెష్యా జాతిరత్నాలు, ఎత్నిక్స్ హస్తకళా ఆభరణాలు, జోల్ ఆధునిక, తేలికపాటి డిజైన్లు, డివైన్ భారతీయ సంప్రదాయ ఆభరణాలు, పిల్లల కోసం స్టార్లెట్ ఆభరణాలు ఉంచామని పేర్కొన్నారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, కార్యదర్శి ఎస్.జయచంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఆటో యూనియన్ జిల్లా మహాసభల కరపత్రాలను వారు విడుదల చేశారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం అభినందనీయమని, అలాగే ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు కూడా అమలు చేయాలని కోరారు. ఈనెల 19న నిర్వహించనున్న ఆటో యూనియన్ జిల్లా మహాసభలకు ఆటో కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మెగా డీఎస్సీ ఫైనల్ కీ టాపర్‌కు సన్మానం



ఉషారాణిని అభినందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి పరసారత్నం

తిరుపతి (విద్య), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నారాయణ డీఎస్సీ కోచింగ్ సెంటర్ విద్యార్థిని, డీఎస్సీ అభ్యర్థి ఎం.ఉషారాణిని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి పరసారత్నం ఘనంగా సన్మానించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ ఫైనల్ కీ ప్రకారం ఉషారాణి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఆదివారం స్థానిక ఎస్వీజేఎస్ఎం పాఠశాల ఆవరణలో జరిగిన ఓ కార్యక్రమానికి మంత్రి కొల్లు రవీంద్ర, పరసారత్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమెను దుశ్శాలువతో సన్మానించి అభినందించారు. కోచింగ్ సెంటర్ డైరెక్టర్ నారాయణ మాట్లాడుతూ ఉషారాణి మెరిట్ లిస్టులో స్టేట్ టాపర్‌గా నిలిచారని, ఆమెతోపాటు మొత్తం 300 మంది తమ విద్యార్థులు ఉపాధ్యాయులుగా ఎంపిక కానున్నారని వెల్లడించారు.

ఘనంగా కనకాభిషేక మహోత్సవం



కనకాభిషేకం చేయించుకున్న దంపతులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సేవా సమాజం ఆధ్వర్యంలో 108 వృద్ధ జంటలకు సామూహిక కనకాభిషేక మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీటీడీ పద్మావతి కల్యాణ మండపం బ్లాక్ 3లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఐదుపదుల వయస్సు దాటిన ఆర్యవైశ్య దంపతులను ఆహ్వానించారు. ముందుగా అమ్మవారి ప్రతిమను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు, కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం దంపతులను ఘనంగా సన్మానించారు. వేదపండితులతో సంకల్పం చేయించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వాసవి మాతకు పూజలు చేయించారు. 15ఏళ్లుగా సామూహిక కనకాభిషేకం నిర్వహించడం గొప్పవిషయమన్నారు. ఆర్యవైశ్య సేవా సమాజం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధి లీలాప్రభు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు దిండుకుర్తి నరసింహులు, రామమూర్తి, వెంకటేష్‌గుప్తా పాల్గొన్నారు.

22ఏ జాబితా నుంచి తొలగించండి



సమావేశంలో మాట్లాడుతున్న దామినేడు స్థల యజమానులు

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తమ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని దామినేడు స్థల యజమానులు కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ దామినేడు గ్రామ లెక్క దాఖలాలోని సర్వే నెం19లో ఉన్న తమ భూములను 22ఏ జాబితాలో చేర్చడం వల్ల ఇల్లు కట్టుకునేందుకు, ఇతర లావాదేవీలు జరుపుకునేందుకు వీలు కావడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, మీరయ్య, పద్మావతి, పద్మశ్రీ, శారద, నాగేశ్వరరావు, శారద, లక్ష్మీదేవి, అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



తిరుపతి(క్రీడలు), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. బైరాగిపట్టెడలోని ఓ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా డాక్టర్ పాకనాటి హరికృష్ణ (ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, ఎస్వీయూ), కార్యదర్శిగా పి.రామచంద్రయ్య (టీటీడీ ఏఈ), ఉపాధ్యక్షులుగా ఓంప్రకాష్‌రెడ్డి, ఆనందరావు, రాఘవులు, వెంకటేశ్వర్లు, రామయ్య, కోశాధికారిగా కృష్ణప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా రామకృష్ణారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా రెడ్డెప్ప, రమేష్, రఘు, ఆచార్య, నాగలక్ష్మి, దేవమ్మ, ఈసీ మెంబర్లను ఎన్నుకున్నారు. త్వరలోనే జిల్లా,రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ నిర్వహిస్తామని తెలిపారు.

రేపటి నుంచి నాయుడుపేటలో చెన్నై ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్

నాయుడుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు (చర్లపల్లి) - నుంచి చెన్నై వెళ్లే చెన్నై ఎక్స్‌ప్రెస్ (రైలు నెంబరు 12604)కు ఈనెల 19వ తేదీ మంగళవారం నుంచి నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో ఆపనున్నట్లు సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి పేర్నాటి జోసెఫ్, కార్య దర్శులు ఆర్.రాఘవన్, కె.కిరణ్ తెలిపారు. ఆదివారం వారు మాట్లా డుతూ గతంలో చెన్నై ఎక్స్‌ప్రెస్ నాయుడుపేటలో ఆగుతుండగా, కొవిడ్ సమయంలో స్టాపింగ్ ఎత్తేశారని చెప్పారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కృషితో నాయుడుపేటలో చెన్నై ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్ పునరుద్ధరిస్తూ సదరన్ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు.

వర్షాలకు నేలవాలిన వరి పంట



జీలపాటూరులో వర్షాలకు నేల వాలిన వరి పంట

పెళ్లకూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కోత దశలో ఉన్న వరి పంట నేల కొరిగింది. రానున్న రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో వరి పంటకు మరింత నష్టం వాటిల్లే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జీలపాటూరు, చిల్లకూరు, చావాలి, పెళ్లకూరు, కొత్తూరు, రావులపాడు, భీమవరం, నెలబల్లి పుల్లూరు, పసుపుకండ్రిగ, కలవకూరు కప్పగుంట కండ్రిగ గ్రామాల్లో రైతులు సాగుచేసిన వరి కోత దశకు చేరుకుంది. ఇప్పుడిప్పుడే నూర్పిడి ప్రారంభించిన రైతులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుండడంతో చేతికి అందివచ్చిన పంట నేల పాలవుందని ఆందోళన చెందుతున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

తిరుపతి అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరసారత్నం సతీమణి కస్తూరమ్మ 5వ వర్ధంతిని పురస్కరించుకుని బీఆర్ అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథులుగా మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పేదల సౌకర్యార్థం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పరసారత్నానికి ఆ దేవదేవుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. హాజరైన వారికి వైద్య పరీక్షలతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, ఏపీ జీబీసీ చైర్మన్ సుగుణమ్మ, టీడీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, కల్లూరు నాగరాజుగౌడ్, భరత్‌కుమార్, సతీష్ చంద్ర, పరమశివం, ఆల్మాన్‌రాజు, నగేష్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసం శుద్ధజలం



శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నగర ప్రజల ఆరోగ్యం కోసం జేఎంసీ ట్రస్టు ద్వారా శుద్ధజల కేంద్రాలను అందుబాటులోకి తెచ్చినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఎమ్మెల్యే తనయుడు ఆరణి మదన్ పుట్టిన రోజును పురస్కరించుకుని రుయా ఆస్పత్రి వద్ద అన్నదానం చేశారు. 18వ డివిజన్‌లో బండారి ఆంజనేయస్వామి ఆలయం వద్ద, 19వ డివిజన్‌లలో అన్నాక్యాంటీన్ సమీపంలో ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రాలను ఆయన శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడితో కలసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే జీవకోనలో రెండు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. తాజాగా మరో రెండు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, టీడీపీ నేతలు మహేష్‌యాదవ్, సూరా సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు రేవతి, నారాయణ, పొన్నాల చంద్ర, ఎస్‌కే బాబు, జానకిరామిరెడ్డి, వినోద్‌రాయల్, సానె శ్రీను, మధులత, శిరీష పాల్గొన్నారు.



తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తనయుడు ఆరణి మదన్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆదివారం 18, 19 డివిజన్లలో ఆర్వో ప్లాంట్లను ప్రారంభించారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడితో కలిసి ఎమ్మెల్యే వాటిని ప్రారంభించారు. ఆరణి జగన్, జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి, 18, 19 డివిజన్ల ఇన్‌చార్జులు ఉదయం ముదిరాజు, జానకిరామ్‌రెడ్డి, జనసేన సత్యవేడు నియోజకవర్గ జనరల్ సెక్రటరీ హేమసుందరం పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



శ్రీకాళహస్తి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆదివారం గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ క్షమాపణలు చెప్పాలి

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల నిరసన



నిరసన తెలుపుతున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు

తిరుపతి (రవాణా), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్‌కు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు సోముయాదవ్, తులసి రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం తిమ్మినాయుడుపాలెం ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. దగ్గుపాటి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతపురంలో సినిమా ప్రదర్శనను అడ్డుకుంటామంటూ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు బాధ కలిగించాయన్నారు. తమ హీరో ఏనాడు పార్టీ పరంగా ఎవరినీ దూషించలేదని, కట్టె కాలేవరకు టీడీపీతోనే ఉంటానని చెప్పారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను త్రీవంగా ఖండిస్తున్నామన్నారు.

కరిమారియమ్మ ఆలయంలో అన్నదానం



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : తిరుపతి కరిమారియమ్మ ఆలయంలో ఆదివారం భక్తులకు అన్నదానం చేశారు. ఆడిమాసాన్ని పురస్కరించుకుని జూలై 18వ తేదీ నుంచి నెల రోజులపాటు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రోజుకో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆడిమాసం ముగింపు సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, నాగేశ్వరరావు, బాబు, ఆనంద్, సుబ్రహ్మణ్యం, మాధవ్, వెంకటరమణ, ప్రకాష్, మునస్వామి, సుబ్రహ్మణ్యంరెడ్డి, కేఎస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచే జోనల్ స్థాయి క్రీడా పోటీలు



శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బ్యాడ్మింటన్ పోటీలకు ముస్తాబైన ఇండోర్ స్టేడియం

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు జోనల్‌స్థాయి క్రీడా పోటీలు కోలాహలంగా జరగనున్నాయి. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం, హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని శాప్ ఆధ్వర్యంలో క్రీడా సంబరాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. జోనల్ స్థాయిలో సత్తాచాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. తొలిరోజు ఉదయం 10 గంటలకు ఎస్వీ స్టేడియంలో ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరుకానున్నారు. డీఎస్‌డీవో శశిధర్ పర్యవేక్షణలో ఈ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. వర్షం కారణంగా పోటీలు ఆగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. అలాగే 20న రిజర్వ్‌డేగా నిర్ణయించారు.

● **1,880మంది క్రీడాకారులు రాక** : రాయలసీమ జోన్ పరిధిలో వచ్చే తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, అనంతపురం, సత్యసాయి, నంద్యాల, కర్నూలు జిల్లాల నుంచి మొత్తం 1,880మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. తిరుపతి జిల్లా నుంచి 235మంది క్రీడాకారులు పోటీ చేయనున్నారు.

● **మైదానాలు ఇవే** : జోనల్ పోటీల కోసం ఎస్వీ స్టేడియం, శ్రీనివాస క్రీడాసముదాయం, ఎస్వీ ఆర్ట్స్ మైదానం, ఎస్వీయూ స్పోర్ట్స్ ఎరీనాలను ముస్తాబుచేశారు.

పది పాఠశాలల్లో బస : క్రీడాకారులకు నగర పరిధిలోని పది మున్సిపల్, ప్రభుత్వ పాఠశాలల్లో బస ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక రవాణా ఏర్పాట్లు, మూడు పూటలా భోజన సదుపాయం కల్పించారు. ఎంపికచేసిన 10పాఠశాలలకు డీఈవో ఆదేశాల మేరకు సోమ, మంగళవారాలలో సెలవు ప్రకటించారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

ముక్కంటి సేవలో గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



శ్రీకాళహస్తి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆదివారం గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

సుబ్రహ్మణ్యస్వామికి పంచామృత అభిషేకం



ఏర్పేడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పాపానాయుడుపేటలో వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారికి ఆదివారం పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మురుగప్ప ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న ఆడికృత్తిక ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి.

మహాభారత క్విజ్ విజేతలకు అవార్డుల ప్రదానం

ఏర్పేడు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పాపానాయుడుపేటలో ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి వారి ఆలయంలో ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు ధర్మరాజస్వామివారి ఉత్సవాలు జరిగాయి. ఈ సేవధ్యంలో ప్రతి యేడాదిలాగే ఆదివారం ఆలయంలో మహాభారతంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చైతన్య ప్రథమ బహుమతి, దామురెడ్డి ద్వితీయ బహుమతి, సురేష్ తృతీయ బహుమతిని అందు కున్నారు. వారికి మహాభారత జ్ఞానసేన అవార్డుతో పాటు బహుమ తులను దేవేశ సంఘం సభ్యులు ప్రదానం చేశారు. కృష్ణప్ప మొదలి, సీతాపతి, తంజా శ్రీను, అర్జునబాబు, రవికుమార్, సురకవి, శ్రీను, విజయ్, సోము, రమేష్, త్యాగరాజా తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



కేవీబీపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువపూడి గ్రామంలో కొలువైన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని గ్రామవీధుల్లో ఊరేగించారు. ప్రజలు కర్పూర హారతులు సమర్పించారు. ఆలయ ధర్మకర్త మనోహర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ● గురుకులకండ్రిగ గ్రామంలో కొలువైన వేమాలమ్మకు కొలువు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. సర్పంచ్ రవి, మాజీ సర్పంచ్ జనార్దనరెడ్డి కార్య నిర్వాహకులుగా వ్యవహరించారు.

వైభవంగా కల్యాణ వెంకన్న ఉట్లోత్సవం



తిరుచ్చిపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న



ఉట్లోత్సవంలో పాల్గొన్న యువకులు

నారాయణవనం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నారాయణ వనంలోని కొలువైన పద్మావతి దేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉట్లోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య పూజలు చేశారు. అనంతరం తోమాల సేవ, పంచంగ శ్రవణం జరిపించారు. సాయంత్రం గోపూజ చేసి ఉట్లోత్సవం కోలాహలంగా నిర్వహించారు. యువకులు ఉట్లకొట్టేందుకు పోటీపడ్డారు. అనంతరం శ్రీకృష్ణ భగవానుడు, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటన్న తిరుచ్చి వాహనంపై పుర వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారి కాళి నాగరాజు, ఆలయ అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరువునష్టం కేసు వేస్తా: యాచేంద్రనాయుడు

నాగలాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో ఎదురైన ఓటమితో వైసీపీ నుండి టీడీపీలోకి వచ్చిన వైసీపీ కోవర్టులు పార్టీని బలహీన పరచేందుకు కుట్రపన్నుతున్నారని తిరుపతి పార్లమెంట్ టీడీపీ కన్వీనర్ యాచేంద్రనాయుడు ఆరోపించారు. ఆరోపణలు చేస్తున్నవారు దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలన్నారు. కథనం ప్రచురించిన సాక్షి మీడియాపై, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై పరువునష్టం కేసు వేస్తున్నట్లు తెలిపారు.

పరసా కస్తూరికి నివాళులు



శ్రీకాళహస్తి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరసారత్నం సతీమణి పరసా కస్తూరి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం తిరుపతిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ హాజరయ్యారు. కస్తూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

మంత్రి కొల్లు రవీంద్రకు సాదర స్వాగతం



రేణిగుంట ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మంత్రి కొల్లు రవీంద్రకు తిరుపతి విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఆదివారం ఇండిగో విమానంలో విజయవాడ నుంచి విచ్చేసిన ఆయనకు తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, విమానాశ్రయ అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన తిరుపతిలో జరిగిన కార్యక్రమానికి హాజరై తిరిగి మధ్యాహ్నం ఇండిగో విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

తెలంగాణ మంత్రికి స్వాగతం

రేణిగుంట ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మంత్రి వివేక్ వెంకట స్వామికి తిరుపతి విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఆదివారం తిరుపతిలో జరిగే ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో ఆయన ఇక్కడికి చేరుకున్నారు. ఆయనకు బీసీ సంఘం నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని తిరిగి మధ్యాహ్నం ఇండిగో విమానంలో హైదరాబాద్‌కు వెళ్లారు.

ఆర్ఎంపీల ఆత్మీయ సమ్మేళనం

శ్రీకాళహస్తి: స్థానిక ఎంజీఎం ఆస్పత్రిలో ఆదివారం ఆర్ఎంపీ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనానికి శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, బీఎన్‌కండ్రిగ, కేవీబీపురం, వరదయ్యపాళెం, నాయుడుపేట, సూళ్లూరు పేట ప్రాంతాల నుంచి సుమారు 150మంది ఆర్ఎంపీ వైద్యులు హాజరయ్యారు. పేదలకు ఎలాంటి వైద్యసేవలు అందించాలనే అంశంపై చర్చించారు.

సత్యవేడు టీడీపీలో ఆకాశరామన్న ఉత్తరం కలకలం

సత్యవేడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు టీడీపీలో ఆకాశరామన్న ఉత్తరం కలకలం రేపుతోంది. 2024 ఎన్నికల్లో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు కొందరు అధిష్ఠానం బరిలోకి దించిన అభ్యర్థికి కాకుండా స్వతంత్ర అభ్యర్థికి పని చేశారని, ఈక్రమంలో ఆ స్వతంత్ర అభ్యర్థి నుండి సుమారు రూ.10 కోట్లు తీసుకున్నారని ఏడు మండలాలకు చెందిన 30 మంది పేర్లతో రెండు రోజుల క్రితం ఒక ఆకాశరామన్న ఉత్తరం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. వైసీపీ అనుకూల మీడియాలో ఈ కథనం ప్రముఖంగా కావడంతో ఇదంతా వైసీపీ కుట్ర అని ప్రచారం జరుగుతోంది. అయితే 2024 ఎన్నికల్లో ఆదిమూలం వైసీపీ నుండి టీడీపీలోకి వచ్చినపుడు మొదలైన విభేదాలు టీడీపీలో ఇప్పటికీ సద్దుమణిగేలేదనేందుకు ఇది తాజా ఉదాహరణ మాత్రమే. ఆది మూలం గెలుపుకు పనిచేయబోమంటూ అప్పట్లోనే టీడీపీలోని కొందరు బహిరంగంగానే స్వతంత్ర అభ్యర్థికి ప్రచారం చేశారు. గెలిచిన తర్వాత కూడా ఆదిమూలంకి సొంత పార్టీలో సెగ తగులుతూనే ఉంది. ఒక మహిళా నేత ఆరోపణతో ఆయనను టీడీపీ నుంచి ఏకంగా సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో పాటు రెండు నెలల క్రితం కూరపాటి శంకర్‌రెడ్డిని పార్టీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్‌గా నియమించారు. ఈయన తీరుపై ఆదిమూలం అసహనం ప్రకటిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే నారాయణవనంలో టీడీపీ ఫ్లెక్సీలు చించివేత, పిచ్చాటూరులో టీడీపీ నేతపై దాడి వంటి సంఘటనలు జరిగాయి. దీనిపై పార్టీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్ పిచ్చాటూరులో వైసీపీ సమావేశం నిర్వహించి టీడీపీలో ఇలాంటి చర్యలు మానుకోవాలని లేకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆకాశరామన్న లేఖ ప్రత్యక్షమైంది. నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ మొదలైన వేళ ఈ ఆరోపణలు తెరమీదకు రావడం విశేషం.



సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న లెటర్







గాజులపెళ్లూరులో సిమెంట్ రోడ్డుపై మట్టి తోలిన దృశ్యం-కాంపాళెం దళితవాడలో బురదమయమైన వీధి- నీర్పాకోటలో సిమెంట్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

వానలు..కష్టాలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో కురుస్తున్న వర్షాలతో గాజులపెళ్లూరు, కాంపాళెం దళితవాడ, నీర్పాకోట మిట్ట దళితవాడలో సిమెంట్ రోడ్లలో నీరు నిలిచి పోయింది. రోడ్డు లోతట్టుగా ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ మూడు గ్రామాలలో పది సంవత్సరాల క్రితం సిమెంట్ రోడ్లు వీధులు లోతట్టుగా ఉన్నప్పుడు వేశారు. తర్వాత ఆ గ్రామాలలో ఇళ్లు ఎత్తులో నిర్మించుకోవడంతో రోడ్లు తగ్గులో ఉండిపోయాయి. ఫలితంగా నీరంతా నిలిచిపోతోంది. గాజులపెళ్లూరులో అయితే పోలేరమ్మ వీధిలో గత వారం జాతర కోసం గ్రామస్తులు ఈ వీధిలో మట్టిని తోలారు. వర్షం రావడంతో వీధి బురదమయంగా మారింది. నీర్పాకోట మిట్ట దళితవాడ రోడ్డు చెరువును తలపిస్తోంది. కాంపాళెం దళితవాడలోనూ ప్రజలు వాననీటితో ఇబ్బందులు పడుతున్నారు. ఈ మూడు గ్రామాలలో కొత్తగా సిమెంట్ రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

నష్టపోయిన వరి, సజ్జ రైతులు

కేవీబీపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న చెదురు మదురు వర్షాలకు వరి పంట నేలవాలింది. సజ్జ పంట ఒరిగి కంకులు విరిగిపోయాయి. ముఖ్యంగా చేతికి వచ్చే దశలో వరి నేలమట్టం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో 11 మందికి సీఎం సహాయ నిధి చెక్కులను సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుదాకర్‌నాయుడు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు, నాయకులు సుందరయ్య, మునెయ్యనాయుడు, రవినాయుడు, మనోహర్‌నాయుడు, మధునాయుడు, మునిరాజ, శేషయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడికి పూజలు

కాంపాళెం గ్రామంలో శ్రీకృష్ణ మందిరంలో జరుగుతున్న శ్రీకృష్ణస్వామి ఉత్సవాలలో కూరపాటి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు.

భక్తజనసంద్రం ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తజనసంద్రంగా మారింది. వారాంతపు సెలవులు వరుస సెలవులుకావడంతో కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలు నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 26వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేపట్టారు.



యువగళం టీం సభ్యుడికి ఆర్థిక సాయం

తడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తడ మండలం పులిచేంద్ర గ్రామం దళితవాడలో ఇటీవల మృతి చెందిన యువగళం టీం సభ్యుడు, ఐటీడీపీ కార్యకర్త లోకేశ్ కుటుంబానికి తిరుపతి పార్లమెంట్ ఐటీడీపీ అధ్యక్షుడు యాచేంద్ర నాయుడు సత్య వేడు ఐటీడీపీ నాయకులతో కలిసి ఆర్థిక సాయం అందించారు. ఆదివారం లోకేశ్ ఇంటికి చేరుకున్న యాచేంద్ర నాయుడు లోకేశ్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ సత్యవేడు అధ్యక్షుడు సంతోష్‌కుమార్ ఐటీడీపీ నాయకులు వెంకటేష్, దాము, ప్రేమ్, రమేష్, సురేష్ చౌదరి, వేణు, పృథ్వీ, వినీత్ తదితరులు పాల్గొన్నారు.



లోకేశ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న యాచేంద్ర నాయుడు, నాయకులు

వైభవంగా తెప్పోత్సవం

పిచ్చాటూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రామగిరి వాలీశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న కుమార సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో మూడు రోజులుగా ఆడికృత్తిక ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మొదటి రోజు భరణి కృత్తిక ఉత్సవాలు, రెండవ రోజు ఆడికృత్తిక ఉత్సవాలు, మూడవ రోజు ఆదివారం రోహిణి కృత్తిక ఉత్సవాలు జరిగాయి. నంది పుష్కరిణిలో తెప్పోత్సవం ఆదివారం సాయంత్రం కనుల పండువగా సాగింది.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగి స్తామని వైసీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ తెలిపారు. మండలంలోని వీఎస్‌పురంలో గ్రామంలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మణినాయుడు, ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ వేలూరు రాకేష్, నాయకులు గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, గురవయ్య, అజయ్‌రెడ్డి, జయచంద్రనాయుడు, భాను ప్రకాష్‌రెడ్డి, కిరణ్‌యాదవ్, సర్పంచ్ సిద్ధమ్మ పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

రేణిగుంట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రానున్న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని అర్బన్ సీఐ జయచంద్ర రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో అర్బన్ పరిధిలోని రౌడీ షీటర్లకు దిశా నిర్దేశం చేశారు. వినాయక చవితి ఊరేగింపులో ఎలాంటి వివాదాలకు పోరాదని హెచ్చరించారు. వినాయక చవితి మండపాలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు.

గ్రామ దేవతకు పొంగళ్లు

వరదయ్యపాళెం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కదూరులో ఆదివారం గ్రామదేవత వేమాలమ్మకు మహిళలు పొంగళ్లు పెట్టారు. ఉదయం వివిధ అభిషేకాలు, పూజలు నిర్వహించి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. సర్పంచ్ శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు రమేష్‌రెడ్డి, వైసీపీ నాయకుడు సందీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే



మంగళవీధిలో రోడ్డుపైకి చేరిన మురుగువ్యర్థాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని మంగళవీధిలో రోడ్డు చినుకు పడితే చిత్తడిగామారుతోంది. పట్టణ నడిబొడ్డున ఈ ప్రాంతం ఉంది. ఎగువ ప్రాంతం నుంచి వెలు వడే మురుగు సాగే రెండు ప్రధాన కాలువలు ఇక్కడ కలుస్తాయి. ఒకటి కొత్తపేట నుంచి మరో కటి నాగుల గుంట నుంచి వచ్చే కాలువలు ఈ వీధిలో చేరుతాయి. వర్షం పడితే కాలువలలోని మురుగు, వ్యర్థాలు రోడ్డుపై స్తంభించిపోతున్నాయి. ఈ వీధిలో పలు ప్రైవేటు పాఠశాలలు ఉండటంతో విద్యార్థులు, స్థానికులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. కాలువలో పేట్టు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీకాళహస్తిలో ముసురువాన

శ్రీకాళహస్తి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఆదివారం ముసురువాన కురిసింది. మూడు రోజుల నుంచి అడపదడపా వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు పూర్తిగా వాతావరణం ముసురుగా మారింది. రోజంతా జల్లులు కురుస్తూ మధ్యమధ్యలో తేలికపాటి వర్షం నమోదైంది.



పీవీరోడ్డులో కురుస్తున్న వర్షం

పుత్తూరు వార్తలు

ఉచిత ప్రయాణం.. వెల్లుబికిన సంతోషం



చంద్రబాబు, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న మల్లిక

వడమాలపేట,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు సర్వీసు ప్రారంభంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం వడమాలపేటలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాగా వడమాలపేటకు చెందిన మల్లిక శనివారం ఉచితంగా తిరుపతిలోని ఇస్కాన్ ఆలయ దర్శనానికి వెళ్లింది. తిరిగి వస్తూ స్థానికంగా టీడీపీ నాయకులు చేపట్టిన పాలాభిషేకం పాల్గొన్నారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి అభిమానం చాటుకుంది. టికెట్ లేకుండా ప్రయాణ వసతి కల్పించిన ఈ ప్రభుత్వం ఇలాగా కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు.

ఆటో డ్రైవర్ల యూనియన్ మహాసభలను జయప్రదం చేయండి

పుత్తూరు టౌన్, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19వ తేదీన తిరుపతిలో వేమన విజ్ఞాన కేంద్రంలో ఆటో కార్మికుల తిరుపతి జిల్లా రెండవ మహాసభలు జరుగనున్నాయి. దీనికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆవిష్కరించారు. ఆటో కార్మికులు యాసిన్ బాషా, రామలింగం, సుబ్రమణ్యం, దేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరిగేనా?

ప్రమాదకరంగా పట్టాలు దాటుతున్న గ్రామీణులు





ఇనుప స్తంభాలను తొలగించిన ప్రజలు

పుత్తూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎగువ పుత్తూరు, దిగువ పుత్తూరు మధ్యలో వెళ్తున్న పట్టాలపై పుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. పట్టణంలోని ధర్మరాజ స్వామి ఆలయం ఎదురుగా రైల్వే ట్రాక్ ఉంది. ఇది పుత్తూరు పట్టణాన్ని రెండుగా చీలుస్తోంది. పైవైపు, దిగువ పుత్తూరుగా పిలిచే వీటి మధ్య ఉన్న ట్రాక్‌ను నిత్యం ప్రజలు దాటుకుంటూ వెళ్తున్నారు. పైవైపున్నారులోనే ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యశాలలు, బ్యాంకులు, దినసరి మార్కెట్ ఉండడంతో దిగువ పుత్తూరు ప్రజలు అనివార్యంగా పట్టాలను దాటాల్సి వుంది. ఇదే కాకుండా దిగువ పుత్తూరు వైపు దాదాపు పది గ్రామాల ప్రజలు కూడా పట్టాలు దాటి పుత్తూరులోకి చేరుకోవాల్సిందే. హైస్పీడ్ రైల్ కారణంగా స్టేషకు ఉత్తరం, దక్షిణం వైపు రైల్వే శాఖాధికారులు ప్రమాదాల నివారణకు కిలోమీటరు వరకు పట్టాలు దాటేందుకు వీలులేకుండా రక్షణ గోడను నిర్మించారు. అలాగే ధర్మరాజ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న సందులో కూడా ఇనుప స్తంభాలను పాతి పెట్టారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న తిరునాళ్ల సందర్భంగా ఆ ఇనుప స్తంభాలను ప్రజలు తొలిగించారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో పుట్ ఓవర్‌బ్రిడ్జిని నిర్మించాలని చాలా కాలంగా ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి రోజా, ప్రస్తుత ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెన్నై వెళ్లి రైల్వే అధికారులకు వినతి పత్రాలను అందించారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి పుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది.

పుష్కరిణి నిర్మాణం జరిగేనా?



అప్పలాయగుంట వద్ద నున్న దామరగుంట

వడమాలపేట,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నిత్యం భక్తుల తాకిడితో అభివృద్ధి చెందు తున్న అప్పలాయగుంటలో పుష్కరిణి నిర్మాణం కలగానే మిగిలిపోతోంది. ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి తూర్పు ముఖంగా 27.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దామరగుంటలో పుష్కరిణి నిర్మాణ ప్రక్రియ ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. టీటీడీ అనుబంధ ఆలయాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందుతోంది అప్పలాయగుంట. దామరగుంటలో పుష్కరిణి, మిగిలిన స్థలంలో పార్కింగ్, పార్క్ నిర్మించాలని అప్పటి మంత్రి ముద్దుకృష్ణమ ప్రయత్నించారు. ఇదే ప్రతిపాదనను ప్రస్తుత ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తాజాగా దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడికి విన్నవించారు. కాగా ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. పుష్కరిణి నిర్మించి చక్రస్నానం, కార్తీక మాసంలో తెప్పోత్సవాలు నిర్వహించేలా పుష్కరిణి నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి



మర్రినే కప్పేసింది

మర్రిచెట్టు కింద మరే మొలకా మొలవదని అంటారు. కింద అయితే మొలవదు కానీ, మరి పైన...? అందుకేనేమో ఈ గురివింద తీగ ఏకంగా మర్రి చెట్టులోనే మొలిచి అల్లుకుంటూ అల్లుకుంటూ మొత్తం వృక్షాన్నే ఇలా కప్పేసింది. తెల్లటి పూతతో.. కశ్మీర్‌లో మంచురాలిన వృక్షంలా కనిపిస్తోంది. కోట పట్టణంలో శ్యామసుందరపురానికి వెళ్లే దారిలో ఈ శ్వేత సౌందర్యం కనువిందు చేస్తోంది.

- కోట, ఆంధ్రజ్యోతి

గూడూరును జిల్లాగా ప్రకటించాలి



ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గూడూరు జిల్లా సాధనసమితి సభ్యులు

గూడూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని గూడూరు జిల్లా సాధన సమితి కన్వీనర్ వేగూరు రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం నుంచి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే నివాసం వద్దకు చేరుకుని సునీల్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాధన సమితి ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా పునర్విభజన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని భావిస్తోందని, ఈ క్రమంలో గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించేందు అన్ని వనరులు ఉన్నాయని, ఈ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు ప్రజల ఆకాంక్షను మంత్రుల కమిటీ వద్దకు తీసుకువెళతామన్నారు. నియోజకవర్గంలోని చిల్లకూరు మండలంలో అనేక పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయన్నారు. సాగరమాల రోడ్లు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. వీటన్నింటినీ మంత్రుల కమిటీ దృష్టికి తీసుకువెళ్లి గూడూరును జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సుమన్‌రెడ్డి, అశోక్, గోపి, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, అరుణ్‌కుమార్, దినేష్, ఇబ్రహీం, విజయ్, రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలేరమ్మ ఆలయ ఆర్చి ప్రారంభం

వెంకటగిరి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సొంత నిధులు రూ.50 లక్షలు వెచ్చించి పట్టణంలోని క్రాస్‌రోడ్డులో నిర్మించిన పోలేరమ్మ ఆలయ ఆర్చి నిర్మాణం ఎట్టకేలకు పూర్తి చేశారు. సోమవారం ఆర్చిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఎమ్మెల్యే ఆర్చిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఆర్చి నిర్మిస్తామని గతంలో అమ్మవారికి మొక్కుకున్నానని, ఆ మొక్కు చెల్లించుకోనేందుకు ఇంతకాలం పట్టిందన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఆర్చిని ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పోలేరమ్మ ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరాందాస్ గంగాధర్, యాసవరం, వెంకటగిరి, లింగసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీల అధ్యక్షులు సీసీ నాయుడు, పప్పు చంద్రమౌళి రెడ్డి, రంగినేని రాజా, రాష్ట్ర బ్లయిండ్ స్పోర్ట్స్ అసోషియేషన్ అధ్యక్షుడు పరుచూరి నరసయ్య నాయుడు, బాలాయపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు రావి మస్తాన్ నాయుడు, గొల్లగుంట మురళీకృష్ణ, బీరం రాజేశ్వరరావు, వెంకటముని, బాబు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

గూడూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రవి అన్నారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వినియోగించి కార్మిక సంక్షేమ చట్టాలను నిర్వీర్యం చేశాయన్నారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లల చదువులు, పెళ్లిలు, ప్రసవాలకు ఇవ్వాల్సిన డబ్బులను అందజేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాంత్, సీవీఆర్‌కుమార్, బాబు, రాజా, చెంచురామయ్య, ప్రభాకర్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ సేవలు ఆదర్శనీయం



దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జేవీవీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని మున్సిపల్ కమిసనర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో జేవీవీ ఆధ్వర్యంలో ప్రభాకర్ దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సైన్స్‌పట్ల అవగాహన పెంపొందించడంలో జేవీవీ ఎంతో కృషి చేస్తోందన్నారు. పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, సుమన్‌రెడ్డి, ఇబ్రహీం, శ్రీనివాసాచారి, అశోక్, అరుణ్‌కుమార్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌డీ టిక్కెట్ల కోసం పడిగాపులు
విష్ణునివాసం వద్ద జోరువానలో తడుస్తూ భక్తుల అవస్థలు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలేశుడి దర్శనం కోసం వచ్చే భక్తుల రద్దీ కొనసాగుతోంది. తిరుపతిలోని విష్ణు నివాసం వద్ద సర్వదర్శనం టిక్కెట్ల కోసం క్యూలలో పడిగాపులు కాశారు. వర్షం పడుతున్నా లెక్క చేయకుండా బారులు తీరారు. కొంతమంది గొడుగులు అడ్డుపెట్టుకోగా మరికొందరు టోపీలు, కర్చీఫ్, తువాలును తలకు పెట్టుకున్నారు. క్యూలైన్ల వద్ద పైకప్పులు అమర్చకపోవడం వల్ల అటు ఎండ వేడిమికి తల్లడిల్లుతూ ఇటు వర్షానికి తడుస్తూ భక్తులు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. టీటీడీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

దాడి కేసులో ఐదుగురి అరెస్ట్

దొరవారిసత్రం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం హరిగుండ్రం గ్రామానికి చెందిన సమ్మని రాజయ్యపై దాడి చేసి గాయపరిచిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ అజయ్ కుమార్ తెలిపారు. రెండు రోజుల క్రితం అనేపూడి వద్ద రాజయ్యపై వడికండ్రిగ గ్రామానికి చెందిన వల్లిపి నారయ్య, మరో నలుగురు రాజయ్యపై దాడి చేసి గాయపరిచారని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఆదివారం నిందితులను అరెస్టు చేసి సూళ్లూరుపేట మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుల్లో నలుగురు బాలురు కావడంతో వారిని చిల్డ్రన్స్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు.

రెండు బైక్‌ల ఢీ: ఒకరికి గాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మూరు సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన సుబ్రహ్మణ్యం మోటారు సైకిల్‌పై ఆదివారం రాత్రి గూడూరు వైపు వెళ్తుండగా తుమ్మూరు సమీపంలో ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యంకు గాయాలవడంతో స్థానికులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎడతెరపిలేని వర్షం

వెంకటగిరి టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడి అల్పపీడనం కారణంగా వెంకటగిరిలో శనివారం రాత్రి నుంచి ఎడతెరపి లేని వర్షం కురుస్తోంది. ఆదివారం కూడా వర్షం కురవడంతో ఇళ్ల నుంచి ప్రజలు బయటకు రాలేకపోయారు.







దాతలు అందజేసిన ఎక్స్‌రే మెషిన్, తాళం వేసివున్న ఎక్స్‌రే గది - ఆస్పత్రి ప్రాంగణంలో చెట్లకింద నిరుపయోగంగా అంబులెన్స్

దాతలిచ్చినవీ వినియోగించుకోలేరా?
ప్రభుత్వాస్పత్రిలో నిరుపయోగంగా ఎక్స్‌రే మెషిన్ ● రెండేళ్లుగా మూలన ఉన్న అంబులెన్స్

సూళ్లూరుపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో ఉన్న సౌకర్యాలనూ వినియోగించేకోలేని దుస్థితి నెలకొంది. ఈ ఆస్పత్రికి రోజుకు 150నుంచి 220 మంది వరకు రోగులు వస్తుంటారు. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో జాతీయ రహదారిపై తరచూ జరిగే ప్రమాదాల్లో క్షతగాత్రులను సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకొస్తుంటారు. అయితే ఇక్కడ ఆధునిక వైద్య పరికరాలు, సామగ్రి లేకపోవడంతో బాధితులను తిరుపతి, నెల్లూరు, గూడూరు, చెన్నైకు తీసుకెళ్లమని వైద్యులు సిఫార్సు చేస్తున్నారు. అంతదూరం వెళ్లేసరికి మార్గమధ్యంలో చాలామంది మృతి చెందిన ఘనటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్వర్ణటోల్ ప్లాజా యాజమాన్యం స్పందించింది. 2020ఏప్రిల్‌లో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద గూడూరు, సూళ్లూరుపేట ఆస్పత్రులకు ఆధునాతన సాంకేతికతో కూడిన ఎక్స్ రే మెషిన్‌లను అందించింది. గూడూరు ఆస్పత్రిలో అదే ఏడాది సెప్టెంబరులో వినియోగంలో తెచ్చారు. అయితే సూళ్లూరుపేట ఆస్పత్రిలో ఎక్స్ రే గదికి తాళాలు వేసి పెట్టారు. అలాగే శ్రీసిటీలోని ఓ పరిశ్రమ రూ.30 లక్షలు విలువ చేసే అంబులెన్స్‌ను సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి అందజేసి రెండేళ్లు అవుతున్నా అది నిరుపయోగంగా ఉంది. వైసీపీ పాలనలో అసలు వీటి గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో హెచ్‌డీసీ కమిటీ నియమించింది. కమిటీ సభ్యులు ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఎక్స్‌రే గదితో పాటు పలు కీలక విభాగాల్లో వైరింగ్ బాగలేకపోవడంతో విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని గుర్తించారు. వెంటనే ఎమ్మెల్యే విజయశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఆస్పత్రిని తనిఖీ చేసి ఎక్స్ రే గది, యంత్రాలను పరిశీలించి వైద్యులు, సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఎంఎస్ అగర్వాల్, సీసీఎల్ పరిశ్రమల సహకారంతో రూ.3.50 లక్షలు ఖర్చుచేసి విద్యుత్ వైరింగ్‌తో పాటు ఎక్స్‌రే మెషిన్ గదిని ఆధునికీకరించి వినియోగంలోకి తెచ్చేందుకు చొరవ తీసుకున్నారు. ఇది జరిగి నాలుగు నెలలైనా ఎక్స్ రే మెషిన్ వినియోగంలోకి రాలేదు. ఎక్స్ రే మెషిన్ టెక్నీషియన్ మూడేళ్లగా ఆస్పత్రికి రావడంలేదు. అతను నెల్లూరులో ఉంటూ నెలలో ఒకరోజు వచ్చి జీతం తీసుకుని వెళుతున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండ్ కూడా పట్టించుకోడం లేదని సిబ్బందే చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి దాతలు ఇచ్చిన ఎక్స్ రే మెషిన్, అంబులెన్స్‌ను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



జీలపాటూరు వర్షాలకు నేల వాలిన వరి పంట

వర్షాలకు నేలవాలిన వరి పంట

పెళ్లకూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కోత దశలో ఉన్న వరి పంట నేల కొరిగింది. రానున్న రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో వరి పంటకు మరింత నష్టం వాటిల్లే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జీలపాటూరు, చిల్లకూరు, చావాలి, పెళ్లకూరు, కొత్తూరు, రావులపాడు, బీమవరం, నెలబల్లి పుల్లూరు, పసుపుకండ్రిగ, కలవకూరు కప్పగుంటకండ్రిగ గ్రామాల్లో రైతులు సాగుచేసిన వరి కోత దశకు చేరుకుంది. ఇప్పుడిప్పుడే నూర్పిడి ప్రారంభించిన రైతులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుండడంతో చేతికి అందివచ్చిన పంట నేల పాలవుందని ఆందోళన చెందుతున్నారు.

వర్షంతో అన్నదాతల అవస్థలు

సూళ్లూరుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో ప్రజలతో పాటు అన్నదాతలకు అవస్థలు తప్పలేదు. చేతికొచ్చిన ధాన్యాన్ని అమ్ముకోలేక కల్లాల్లో, ఇతర ప్రాంతాల్లో ధాన్యం రాసుల పోసి నిల్వచేసిన రైతులకు వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల వర్షంలోనూ రైతులు పంట నూర్పిడి చేస్తున్నారు. ధరలేక పొలాల్లోనే నిల్వ చేసుకున్న ధాన్యం వర్షానికి తడవకుండా వేరే ప్రాంతాలకు తరలించి భద్రపరుచుకుంటున్నారు. మొన్నటి వరకు పంటను తడుపుకునేందుకు వర్షం కోసం ఎదురుచూసిన రైతులకు ఎన్నుదశలో చేతికొచ్చిన సమయంలో వర్షాలతో వెన్ను విరిచినట్లయ్యింది.



పొలాల వద్ద నిల్వచేసిన ధాన్యాన్ని విక్రయానికి తరలిస్తున్న రైతులు

రేపటి నుంచి నాయుడుపేటలో చెన్నై ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్

నాయుడుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు (చర్లపల్లి) - నుంచి చెన్నై వెళ్లే చెన్నై ఎక్స్‌ప్రెస్ (రైలు నెంబరు 12604)కు ఈనెల 19వ తేదీ మంగళవారం నుంచి నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో ఆపనున్నట్లు సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి పేర్నాటి జోసెఫ్, కార్యదర్శులు ఆర్.రాఘవన్, కె.కిరణ్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ గతంలో చెన్నై ఎక్స్‌ప్రెస్ నాయుడుపేటలో ఆగుతుండగా, కొవిడ్ సమయంలో స్టాపింగ్ ఎత్తేశారని చెప్పారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కృషితో నాయుడుపేటలో చెన్నై ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్ పునరుద్ధరిస్తూ సదరన్ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



పేదలకు నిత్యావసరాలు అందజేస్తున్న సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

గూడూరు అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ ప్రతినెలా తమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్లు జనార్దనరెడ్డి, రోహిణి సహకారంతో పేదలకు నిత్యావసరాలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సనత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ధనుంజయరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు



చిల్లకూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి ప్రత్యేక అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోటమ్మకు పూజలు



కోట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పరసా కస్తూరమ్మకు వేనాటి నివాళి

సూళ్లూరుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరసా వెంకటరత్నం సతీమణి పరసా కస్తూరమ్మ వర్ధంతి ఆదివారం తిరుపతిలో జరిగింది. కస్తూరమ్మ చిత్రపటానికి టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే టీడీపీ నాయకులు పాకం వెంకటసుబ్బయ్య, సుధాకర్‌రెడ్డి, గొంజి వెంకటేశ్వర్లు, కృష్ణా, మనోహర్ తదితరులు నివాళులర్పించారు.

వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

చిట్టమూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి నిరంజన్ కుమార్ సూచించారు. వరి పంట కోతకొచ్చి నూర్పిడి చేసుకొనే సమయంలో వర్షాలు పడడం వల్ల పంట నేల వాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. మండలంలోని మెట్టు, ఎం.జంగాళపల్లి, అద్దెపూడి, పెళ్లకూరు, గునపాడు, గునపాటిపాళెం, చిట్టమూరు గ్రామాల్లో వరి పైరు నేలవాలిపోయి నీళల్లో ఉందన్నారు. నేలకొరిగిన వరి ఎన్నుపై లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలని సూచించారు. దీనివల్ల 10 నుంచి 20 రోజులు వరి గింజలు మొలకెత్తవని, అంతేకాక రంగు మారకుండా ఉంటుందని చెప్పారు. వరి నూర్పిడి చేసి కల్లాల్లో పోసిన ధాన్యం తడిసిపోతే క్వింటాకు కేజీ ఉప్పుతో పాటు నాలుగు కేజీల ఊక లేదా, నాలుగు కేజీల ఎండు గడ్డిని చిన్నచిన్న ముక్కలు చేసి ధాన్యం రాశుల్లో కలిపిన వారం రోజుల తరువాతైన ఎండబెట్టుకొని అమ్ముకోవచ్చన్నారు.

ఉత్సాహంగా ఉట్టి మహోత్సవం



ఉట్టిని కొడుతున్న చిన్నారులు

సూళ్లూరుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని స్వతంత్రపురంలో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం రెండో రోజు ఘనంగా జరిగాయి. సాయంత్రం ఉట్టి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. యువకులు, చిన్నారులు ఉత్సాహంగా ఉట్టిని కొట్టారు. అనంతరం కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని రాజగోపాలపురంలో ఉట్టి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం రాజగోపాలపురంలోని శ్రీరామమందిరం వద్ద ఉట్టి మహోత్సవం నిర్వహించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కోలాహలంగా ఉట్టి మహోత్సవంలో పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీకృష్ణ కల్యాణోత్సవం



పెళ్లకూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పెళ్లకూరు మండలం చెన్నప్పనాయుడుపేట గ్రామంలో ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవ వేడుక కమనీయంగా జరిగింది. రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ మందిరంలో ఏటా కృష్ణ జయంతి వేడుకలు మూడురోజుల పాటు వైభవోపేతంగా జరుగుతాయి. ఈ ఏడాది యువత ముందుకొచ్చి కృష్ణాష్టమి సంబరాలను దిగ్విజయంగా నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణులను గ్రామంలో ఊరేగించారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం స్వామి, అమ్మవార్లకు వసంతాలు నిర్వహిస్తామని గ్రామపెద్దలు తెలిపారు.

మూగ జీవాలకు వైద్యం చేసేదెవరు?

- పశువైద్య కేంద్రాల్లో డాక్టర్లే లేరు
- రోగాలతో పశువుల మృత్యువాత
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు



బాలాయపల్లి పశువైద్యశాల

బాలాయపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలంలోని మూగ జీవాల వైద్యం చేసేవారే కరువయ్యారు. బాలాయపల్లి, చిలమనూరు, జయంపు గ్రామాల్లో పశువైద్య కేంద్రాలు ఉండగా ఒక్క చోట కూడా వైద్యులు లేరు. రెండేళ్లగా జయంపులో పశువైద్యాధికారి లేకపోగా, చిలమనూరు పశువైద్యశాల వైద్యాధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. బాలాయపల్లి పశువైద్యాధికారి ఇటీవల జరిగిన బదిలీల్లో నెల్లూరు జిల్లా సైదాపురానికి వెళ్లారు. సచివాలయాల పరిధిలో పశుసంరక్షణ అసిస్టెంట్లు ఉన్నా వారు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో ఎవ్వరికీ తెలియదు. మండలంలో వేలాదిమంది పశువుల పెంపకం ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ఆవులతో పాటు గేదెలు, గొర్రెలు, మేకలు పెద్దసంఖ్యలో ఉన్నాయి. వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఏటా రోగాల బారిన పడి పశువుల, గొర్రెలు, మేకలు వందలాదిగా చనిపోతున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బాలాయపల్లి మండలంలోని పశువైద్య కేంద్రాల్లో వైద్యులను నియమించాల్సిన అవసరం ఉంది.

టిడ్కో గృహాల్లో కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

వెంకటగిరి టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుపతి రోడ్డులో ఉన్న టిడ్కో గృహాల్లో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని ఆరు ద్విచక్ర వాహనాలు, ఆరు ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ రమణ మాట్లాడుతూ తగిన ధృవీకరణ పత్రాలు లేకుండా తిరిగే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటగిరి, డక్కిలి ఎస్ఐలు ఏడుకొండలు, శివశంకర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పద్మారావుపై విమర్శలు తగవు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బహుజన ఐక్యవేదిక నాయకులు

కోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దళిత బహుజన ఉద్యమనేత కత్తి పద్మారావుపై విమర్శలు చేయడం సరికాదని ఆ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం దళిత మహాసభ బహుజన ఐక్యవేదిక, ఎమ్మార్పీఎస్, ఉద్యమ సంఘాలు కోటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారంచేడు కేసులో ప్రధాన నిందితుడైన దగ్గుపాటి చెంచురామయ్య కుమారుడు వెంకటేశ్వరరావు తన తండ్రిని అడ్డంపెట్టుకొని బహుజన ఉద్యమ నాయకుడు కత్తి పద్మారావు ఎదిగారని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కారంచేడు ఉద్యమానికి ఊపిరిపోసిన కత్తి పద్మారావుపై వెంకటేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు వెనక్కుతీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మీజూరు మాధవ్, ద్రాసరి సుందరం, లేగూరు విజయ కుమార్, మదన్ మిత్ర, పాలా మల్లికార్జున్, పనబాక హేమంత్, శంకరయ్య, కేశవ్, కృష్ణ, శ్రీను, కోటేశ్వరరావు, ప్రసాద్, రాజముని, రవీంద్ర, రాకేష్, రాజా, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

గూడూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 23వ తేదీన జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో శశికుమార్, రవి, సీవీఆర్ కుమార్, రాజా, చెంచురామయ్య, మస్తాన్, జమాల్ తదితరులు పాల్గొన్నారు.